# విధు

గొల్లపూడి జోగారావుగారు

ఆమెపేరు విధు. ఆమెనివాసము ప్రకృతిశోభాపరిపూర్ణమైన సస్యప్రదేశాల్లో. ఆమె అపూర్వతరసౌందర్యమూర్తి. అందుచేతనే ప్రకృతితో అవిచ్ఛన్నంగా నాటలాడగలిగిందామె. కోయిలమధురగానంలో గొంతెత్తిపాడేది. కొండలోయల్లోని సెలయేటిరొదల్లో కంఠము మేళవించింది. పాంథజనుల బలుకరించి వారిజీవనప్రవృత్తికి నవ్వుకొనేది. ఆమె కీలోకంలో ప్రేమపాత్రు డొక్కడే— ఆమెతాత. ఆమె అమాయిక. ఆమెకుమల్లే తన తాతనందరూ గౌరవించాలనుకునేది. ఆమె ముగ్ధ. తనతాతను వదిలి ఉండగలనా అనుకునేది.

*   *   *   *

విధుసౌందర్యం రాజభవనంవఱకు ప్రాకింది. విధుతాత అతనిదగ్గర వో కృషికుడు. రాజు స్వయంగా వచ్చేడు విధుసౌందర్యము చూడడానికి. స్వంతత్రంగా విధు నివ్వమన్నాడు తాతను పిలిచి. తాత కుటీరంలోకి పోయాడు. విధు ఆతనివైవర్ణ్యము చూచింది. "తాతా! నన్నియ్యకు...నిన్ను వదిలుండలేను నేను." ఆ మౌగ్ధ్యము నాతడు ముద్దుపెట్టుకున్నాడు. పైకొచ్చి రాజుతో చెప్పాడు. "నే నామె నియ్యలేను." రాజులోచనములు కోపారుణితములయేయి. "ఆతని కొరడాలతో కొట్టుడు." అన్నాడు గంభీరంగా. అది అతనికర్కశహృదయం.

విధు పైకొచ్చి తాతను కౌగలించుకొంది. "మాతాతను కొట్టవద్దు." ...ఆక్రోశించింది దీనంగా. అది ఆమెప్రేమహృదయము.

రాజసేవకు లామెను విడదీసేరు. తాత అల్లాగే నిలబడ్డాడు శిలాప్రతిమలా. విధుఅమాయికపుచూపుల్లో జాలి ప్రవహిస్తోంది కొరడాలు యెత్తేరు. విధు చటాల్నిపోయి కౌగలించుకొంది ఆతనివణుకుతోన్న శరీరాన్ని. "మాతాతని కొట్టవద్దు." విధుమీద దెబ్బపడింది....మరొకటి. ఆమె స్మృతితప్పి పడిపోయింది. సుకుమారమైన ఆమెశరీరము కందిపోయింది. రాజుహృదయం కరిగిపోయింది. తేజి దిగి నిశ్చేష్టితమైన ఆమెదేహాన్ను లోపలికి తీసుకుపోయాడు ............ఆమె కనులు తెరచింది. "క్షమించు" అన్నాడు రాజు. "మాతాతను కొట్టవద్దు"